క్లుప్తంగా

నేడు అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

కె.కోటపాడు : మేడిచర్ల గ్రామంలో గల అభయాంజనేయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకుంటారని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదిరెడ్డి వెంకటరావు తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్ సీతారామరాజుకు ఉత్తమ పురస్కారం



ఉత్తమ ఆర్టీసీ కండక్టరుగా సీతారామరాజు పురస్కారం అందుకుంటున్న దృశ్యం

మాడుగుల రూరల్ : ఆర్టీసీలో ఉత్తమ సేవలు అందించిన డెక్కల సీతారామరాజుకు రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 26న విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నట్టు సీతారామరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. కె.జె.పురం శివారు తెలకలదీపం గ్రామానికి చెందిన సీతారామరాజు వాల్తేరు డిపోలో పనిచేస్తున్నారు. గతంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రామప్రసాదురెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. తాజాగా రిపబ్లిక్ డే సందర్భంగా అవార్డు అందుకోవడంతో గ్రామస్తులు, ప్రజాప్రతనిధులు అభినందిస్తున్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



మాజీ సర్పంచ్ పందిరి అప్పారావు (ఫైల్)

గొలుగొండ : పాత కృష్ణదేవిపేట మాజీ సర్పంచ్ పందిరి అప్పారావు(85) మంగళవారం మృతి చెందారు. గ్రామ సర్పంచ్‌గా మూడుసార్లు గెలిచి గ్రామాభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారు. మండలంలో కాంగ్రెస్ పార్టీకి కీలకవ్యక్తిగా పనిచేసి, అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరారు. అప్పారావు మృతి పట్ల మండల నాయకులు సంతాపం తెలిపారు. ప్రస్తుతం అప్పారావు పెద్ద కుమారుడు పందిరి సత్యంనాయుడు గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తున్నారు.

రెండు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు



సింగన్నదొరపాలెంలో పశు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : సింగన్నదొరపాలెం, సూదివలస గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను మంగళవారం నిర్వహించారు. సింగన్నదొరపాలెంలో 82 పశువులకు గర్భకోశ చికిత్స, చూడి తనిఖీలు, సాధారణ చికిత్సలతో పాటు పెయ్యిలకు నట్టల నివారణ మందును కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు అందించారు. పశు సంరక్షణలో పాడి రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలగల లక్ష్మి, పైడినాయుడు, పశువైద్య సిబ్బంది బుజ్జి, సమీరా, ఆదర్స్ పాల్గొన్నారు. సూదివలసలో 65 పశువులకు ఆరోగ్య పరీక్షలను చొడువాడ పశువైద్యాధికారి సింహచలంనాయుడు అందించారు.

పశు ఆరోగ్య శిబిరం విజయవంతం



మాడుగులలో పశు ఆరోగ్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

మాడుగుల : మండల కేంద్రంలో మంగళవారం ఏడీ వి.చిట్టినాయుడు ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. 70 పశువులకు సాధారణ పరీక్షలు, 13 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 5 పశువులకు సూడి పరీక్షలు, 42 పశువులు, 25 పెయ్యిలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 48 మంది పాడి రైతులు ఈ సేవలు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనువాసరావు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సౌజన్య, పశు వైద్య సహాయకులు చంద్ర, కృష్ణారావు, అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన రబీ వరి సాగు విస్తీర్ణం



రైవాడలో ముమ్మరంగా దమ్ములు చేస్తున్న రైతులు

- ప్రభుత్వం నుంచి సహాయం అందక పోవడమే కారణం
- అరకొరగా గ్రామాల్లో రబీ వరి నాట్లు
- నీటి వనరులు ఉన్న గ్రామాల్లో అన్నదాతలు నాట్లు
- నియోజకవర్గంలో సుమారు 3500 ఎకరాల్లో రబీ వరి సాగు



దేవరాపల్లిలో వరి నాట్లు వేస్తున్న మహిళా రైతులు



ఏపుగా ఎదిగిన రబీ నారు

దేవరాపల్లి : కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి సహాయం కొరవడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతకు రైతు భరోసా పథకం పేరిట ప్రతి ఏటా ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచింది. తాజాగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి ఎటువంటి సాయం అందించక పోవడంతో అన్నదాతలు అప్పులు చేసి సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఖరీఫ్‌లో వరుస తుపానులతో పంట తడిసి ముద్దవడంతో పాటు కోత దశలో రెల్లా రాల్చే పరుగు ఇతర తెగుళ్ల ఉధృతితో విపరీతంగా నష్టం వాటిల్లింది. ఒక వైపు ప్రభుత్వం నుంచి సహాయం అందించక పోగా మరో పక్క ప్రకృతి వైపరీత్యాలు, పురుగుల బెడద కారణంగా రబీ వరి సాగుపై ఈ ఏడాది ఆసక్తి కనబరచలేదు. గత ఏడాది కంటే ఈ ఏడాది రబీ వరి సాగు విస్తీర్ణం తగ్గడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

మాడుగుల నియోజకవర్గంలో గత ఏడాది సుమారు 5వేల ఎకరాలలో రబీ వరి సాగు చేపట్టగా, ఈ ఏడాది 3500 ఎకరాలలో మాత్రమే నాట్లు పడే అవకాశం కనిపిస్తుంది. నియోజకవర్గం పరిధిలో ఒక్క మాడుగుల మండలంలో మాత్రమే సుమారు 3వేల ఎకరాలలో రబీ వరి సాగు చేపడుతుండగా, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు మండలాల కలిపి కేవలం 500 ఎకరాలలో మాత్రమే వరి నాట్లు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయం పట్ల నిర్లక్ష్య ధోరణి కనబరచడంతో సాగుకు అన్నదాతలు వెనకడుగు వేస్తున్నారు. దేవరాపల్లి మండలంలో రైవాడ, దేవరాపల్లి, నాగయ్యపేట, సీతంపేట, కాశీపురం, కొత్తపెంట, చేనులపాలెం, చిననందిపల్లి, కలిగొట్ల తదితర గ్రామాల్లోనే రబీ వరి సాగు చేస్తున్నారు.

ప్రభుత్వ సాయం లేదు..



దేవరాపల్లి, రైవాడ రెవెన్యూ పరిధిలో సుమారు 50 సెంట్ల విస్తీర్ణంలో రబీ వరి సాగు చేపట్టాను. సుమారు 28 వేల రూపాయల పెట్టుబడి అయ్యింది. అయితే ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి సహాయం అందించలేదు. గత ప్రభుత్వంలో తమకు రైతు భరోసా పథకంలో ఐదేళ్ల డబ్బులు అందాయి.

–రంది వెంకటరావు, రైతు, దేవరాపల్లి

నెలాఖరులోగా నాట్లు వేసుకోవాలి



సాగు నీటి వనరులు ఉన్న చోట కొందరు రైతులు వరి నాట్లు వేస్తున్నారు. 15 నుంచి 25 రోజుల నారును నెలాఖరులోగా నాట్లుగా వేసుకుంటే దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. నాట్లు వేసే ముందు దమ్ములో 50 కేజీల డీఏపీ, 20 కేజీల యూరియా, 15 కేజీల పోటాష్ కలిపి వేసుకుంటే బాగా దుబ్బు చేస్తుంది.

–వై.కాంతమ్మ, వ్యవసాయ అధికారి, దేవరాపల్లి

కేపీ అగ్రహారంలో తాగునీటి సమస్య పరిష్కారం



కేపీ అగ్రహారంలో మంచినీటి బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీను

బుచ్చెయ్యపేట : తాగునీటి సమస్యను పరిష్కరించిన రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డికి కేపీ అగ్రహారం రైతులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో దేవర వారి పశువులు పాకలు వద్ద తాగునీరు లేక పలువురు రైతులు ఇబ్బందులు పడేవారు. సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, గ్రామస్తులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు దృష్టికి తీసికెళ్లారు. దీంతో జెడ్పీటీసీ రైతుల సమస్యను వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తాగునీటి బోరుకు నిధులు మంజూరు చేశారు. బుధవారం సర్పంచ్ గ్రామ రైతుల సమక్షంలో మంచినీటి బోరు పనులు ప్రారంభించారు. మాజీ సర్పంచ్ దేవర రమణ, ఉప సర్పంచ్ దేవర ముసలినాయుడు నాయకులు, రైతు సంఘ నాయకులు గోపిశెట్టి రమణ, జి.నూకరాజు, దేవర తాతబాబు, పి.మాణిక్యం పాల్గొన్నారు.

గాయపడిన స్వామినాయుడుకు బూడి పరామర్శ



గాయపడిన స్వామినాయుడును పరామర్శిస్తున్న బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దేవరాపల్లి హైస్కూల్ పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ కొరుపోలు స్వామినాయుడును మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పరామర్శించారు. ఇటీవలే ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకున్నారని స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు వెంటనే స్థానిక నాయకులతో కలిసి దేవరాపల్లిలోని స్వామినాయుడు ఇంటికి చేరుకొని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీ డిప్యూటీ సీఎం వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, లలితానాయుడు, కె.వి.రమణ, చొక్కాకుల రమణ, వరదపురెడ్డి అప్పలనాయుడు, కొరుపోలు శ్రీను, వరదపురెడ్డి రమణ, గంగవంశం సంతోష్ పాల్గొన్నారు.

జోరుగా బడి బయట పిల్లల గుర్తింపు సర్వే



కొంతలంలో ఇంటింటా తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తిస్తున్న సీఆర్పీ సతీష్

రోలుగుంట : విద్యాశాఖ చేపట్టిన బడి బయట ఉన్న బడి ఈడు పిల్లల సర్వే కార్యక్రమం మండలంలో జోరుగా సాగుతుంది. సీఆర్పీలు చిరంజీవి, నూర్సీ వారి పరిధిలో గల గ్రామాల్లో ఇంటింటా తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. రోలుగుంట క్లస్టర్ సీఆర్పీ పి.సతీష్ కొంతలం గ్రామంలో మంగళవారం ఇంటింటా తిరిగారు. బడిఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి విద్య ప్రాముఖ్యత, ప్రభుత్వ పాఠశాలలో నడుస్తున్న ఇంగ్లిష్, తెలుగు మీడియం బోధన, విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, ఉచితంగా విద్యార్థులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అందరికీ చదువు.. అందరి బాధ్యత ప్రతి ఒక్కరూ భాగస్వాములై నిరక్షరాస్యుల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నారు. ఎంఈవోలు 1, 2 జానుప్రసాద్, పి.జగ్గారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలను సీఆర్పీలు నిర్వహిస్తున్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలి



ఎ.కొత్తపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి

దేవరాపల్లి : ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో సాగుపై రైతులు దృష్టి సారించాలని, తద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి రైతులకు సూచించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎ. కొత్తపల్లిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ వేరుశనగ పంటను క్షేత్ర స్థాయి సందర్శన చేశారు. గొప్పు దశలో ఉన్న వేరుశనగలో ఎకరానికి 200 కేజీల జిప్సం వేసుకోవడం ద్వారా మొక్క ఎదుగుదలతో పాటు నూనె దిగుబడి అధికంగా వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎ.దివ్య, రైతులు పెద్దాడ సన్యాసిరావు, చిన ఎరుకునాయుడు, లక్కరాజు వెంకటరమణ, కంచిపాటి రాజు పాల్గొన్నారు.

31న ధర్మశ్రీ పదవీ స్వీకారానికి హాజరుకండి

రోలుగుంట : అనకాపల్లి పార్లమెంటు వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా చోడవరం మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీని నియమించిన విషయం విదితమే. ఈ నెల 31న కొంకోట మండలంలో 10 గంటలకు ధర్మశ్రీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ కోరారు.

ఉత్తమ విద్యుత్ ఏఈగా మద్దాల రాంబాబు



జిల్లా విద్యుత్ ఎస్ఈ ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రాంబాబు

మాడుగుల రూరల్ : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 26న మండల విద్యుత్ ఏఈ మద్దాల రాంబాబు ఉత్తమ పురస్కారం అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు గాను అనకాపల్లిలో జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా విద్యుత్ ఎస్ఈ జి.ప్రసాదు చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్టు మంగళవారం తెలిపారు. ఈ సందర్భగా ఏఈ రాంబాబును లైన్‌మేన్లు, సిబ్బంది అభినందించారు.

31న దేవరాపల్లిలో మెగా ఉద్యోగ మేళా

మాడుగుల రూరల్ : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 31 వ తేదీన మెగా ఉద్యోగ మేళా జరుగుతుందని ఎంపీడీవో కొంకి అప్పారావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ మేళాకు హాజరు కావచ్చునని, 16 ప్రైవేటు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు.

పెరుగుతున్న చలిగాలులు

మాడుగుల రూరల్ : పగటి ఉష్ణోగ్రతలు తగ్గడంతో గ్రామాల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువ అయింది. గిరిజన గ్రామాల్లో సాయంత్రం నాలుగు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు చలి గాలులు తీవ్రత ఎక్కువగా ఉంది. మైదాన ప్రాంతంలో కూడా చలి తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు అందోళన చెందుతున్నారు. సంక్రాంతి పండగ పూర్తయిన తర్వాత చలి గాలులు ఎక్కువగా వీస్తున్నాయి. చలి మంచు తీవ్రత ఎక్కువగా పడుతుంది. మంచు పడడం వల్ల మామిడి, జీడిమామిడి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు అందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మామిడి, జీడిమామిడి, చెట్లు పూత పూసే సమయం. ఈ సమయంలో పొగమంచు వల్ల నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

చేనులపాలెంలో ఘనంగా బంగారమ్మతల్లి తీర్థం



బంగారమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి పంచాయతీ శివారు శివరామ చేనులపాలెంలో బంగారమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవార జాము నుండి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బంగారమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం వెంట ఉప సర్పంచ్ రొంగలి కన్నంనాయుడు, బొడ్డు నారాయణమూర్తి, రొంగలి నాయుడు, బంగారయ్య, రొంగలి నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

కశిరెడ్డిపాలెంలో లేగదూడల ప్రదర్శన



లేగదూడలను పరిశీలిస్తున్న డివిజన్ పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకురాలు పుష్ప

రోలుగుంట : జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుండుబాడు పంచాయతీ శివారు కశిరెడ్డిపాలెంలో మంగళవారం కుసుర్లపూడి పశువైద్యాధికారి పైల సురేష్ మెగా లేగదూడల శిబిరాన్ని మంగళవారం ప్రదర్శించారు. పలు గ్రామాల నుంచి 62 మంది పాడి రైతులు లేగ దూడలను తరలించి శిబిరంలో ప్రదర్శించారు. రావికమతం డివిజన్ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకురాలు పుష్ప శిబిరాన్ని సందర్శించారు. ఆరోగ్యంగా ఉన్న వాటిని గుర్తించి బహుమతులను అందజేశారు. పాడి పశువుల పెంపకం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మేలు జాతి పశువుల పెంపకం, ఆడపెయ్యిలు పుట్టించే లింగ నిర్ధారిత వీర్య నాళికల వినియోగంపై తెలిపారు. శిబిరానికి తీసుకొచ్చిన పశువులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. సర్పంచ్ మామిడి అప్పలనర్స ప్రారంభించిన ఈ శిబిరంలో ఎంపీటీసీ గుర్రం లోవరాజు, సిబ్బంది వల్లిక, జగదీశ్వరి, శ్రీను, సన్యాసినాయుడు, రమణ, పాడి రైతులు పాల్గొన్నారు.

తైపురంలో ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

- ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పోటీలు
- ప్రథమ బహుమతి దక్కించుకున్న సింహాద్రిపురం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న జెడ్పీటీసీ రాంబాబు



పరుగు పందెంలో హుషారుగా పరుగులు తీస్తున్న ఎడ్లు

బుచ్చెయ్యపేట : తైపురం గ్రామంలో ఆంజనేయ స్వామి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పలువురు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మూడు వేల మందికి అన్న సమారాధన చేశారు. సాయంత్రం ఎడ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో ప్రథమ బహుమతి సింహాద్రిపురానికి చెందిన అభయాంజనేయ, రెండో బహుమతి నరసయ్యపేటకు చెందిన సిద్ధి వినాయక, మూడో బహుమతి కెఎల్‌బీ పట్నంకు చెందిన అభయాంజనేయ, నాలుగో బహుమతి దండి సురవరంకు చెందిన అర్ధవర్ధనాయుడు, ఐదో బహుమతి మంగళాపురానికి చెందిన అభయాంజనేయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను తదితర నాయకులు స్వామిని దర్శించుకున్నారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

అక్షరాస్యులను చేయడమే ఉల్లాస్ లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చేదిద్దే కార్యక్రమాన్ని అంకిత భావంతో నిర్వహించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాల్లో నిరక్షరాస్యులుగా ఉన్న మహిళలను అక్షరాస్యులుగా తయారు చేసేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఏ కార్యక్రమమైనా అధికారులు అంకితభావంతో నిర్వర్తిస్తేనే నేర వేరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంస్కరణలు చేయడమే కాకుండా అనేక సదుపాయాలు కల్పిస్తున్నాయన్నారు. ఉల్లాస్ కార్యక్రమం ఉద్దేశ్యాన్ని డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించి క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని అధికారులకు సూచించారు. వెలుగు ఏపీఎం కనకరాజు మాట్లాడుతూ మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 1627 డ్వాక్రా సంఘాలు ఉన్నాయన్నారు. అందులో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ఉల్లాస్ కార్యక్రమంలో మొదట విడతలో 57 మంది వలంటీర్లను నియమించి 570 మందిని అక్షరాస్యులుగా తయారు చేశామన్నారు. రెండో విడతలో కూడా విధించిన లక్ష్యాన్ని అధిగమిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో పోలుపర్తి పార్థసారథి, వెలుగు సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మేలు జాతి దూడలపై రైతులు దృష్టి సారించాలి



రైతులకు సూచనలు చేస్తున్న పాయకరావుపేట పశు వైద్యశాఖ ఏడీ శ్రీనివాసరావు

నాతవరం : పశువులకు లింగ నిర్ధారిత వీర్యం ద్వారా మేలు జాతి దూడలు పుట్టడం జరుగుతుందని పాయకరావుపేట పశు వైద్యశాఖ ఏడీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలో మంగళవారం పలు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పశువులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లేగ దూడలకు ఏలికపాములు మందు అందించారు. ఆడ పెయ్యిలు పుట్టడానికి ప్రభుత్వం రాయితీపై ఇంజక్షన్లు సరఫరా చేస్తుందన్నారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఇంజక్షన్ చేసిన పశువులకు విధిగా ఆడ పెయ్యిలు జన్మించడం జరుగుతుందన్నారు. పశు ఆరోగ్య శిబిరాల ద్వారా తాము అందిస్తున్న సూచనలు సలహాలు విధిగా పాటిస్తే ఆశించిన ప్రయోజనాలు రైతులు పొందుతారన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ బాజ్జీ మృతికి సంతాపం

అంత్యక్రియలకు యూనియన్ రూ.30 వేల ఆర్థిక సాయం



షేక్ బాజ్జీ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎల్ఐసీ యూనియన్ నాయకులు

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన ఎల్ఐసీ సీనియర్ ఏజెంట్ షేక్ బాబాసాహెబ్(బాజ్జీ) (59) గుండె పోటుతో మృతి చెందారు. చోడవరం నుంచి సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుకు గురయ్యారు. అతని వెంట ఉన్న దేవరాపల్లికి చెందిన కొల్లూరు పైడిశెట్టి స్థానికుల సహాయంతో చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించడంతో మృతదేహాన్ని రాత్రికి అతని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చారు. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అతని మరణవార్త తెలుసుకున్న చోడవరం ఎల్ఐసీ సీనియర్ బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావు, ఏబీఎం శ్రీనివాసరావు, ఎల్ఐసీ ఏజెంట్ల విశాఖ డివిజన్ యూనియన్ నాయకుడు ఎం.నాగరాజు, చోడవరం యూనియన్ కార్యదర్శి శంకరరావు, కోశాధికారి శ్రీనివాసరావు, నాయకులు కె.వి.రమణ తదితరులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎల్ఐసీ యూనియన్ తరపున అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.30 వేలు నగదును అందజేశారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.